ప్రజాశక్తి
మంగళవారం 25 మార్చి 2025





అనంతపురం ఆసుపత్రిలో రైతులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నష్టపోయిన రైతులను ఆదుకోండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రెండు రోజులుగా కురిసిన అకాల ఈదరు గాలలు, వడగండ్ల వర్షాలతో పంట నష్టపోయిన అరటి, మామిడి, బొప్పాయి తదితర ఉద్యానవన రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షంతో పంట నష్టపోయి ఆత్మహత్యకు యత్నించి అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యల్లనూరు మండలం నీర్జాంపల్లికి చెందిన అరటి రైతులను సిపిఎం బృందం సోమవారం పరామర్శించింది. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ అకాల వర్షం ఈదురు గాలుల వల్ల యల్లనూరు, పుట్లూరు శింగనమల, యాడికి మండలాల్లో రెండువేల ఎకరాలకుపైగా ఉద్యానవన పంటలు నేలకూలాయన్నారు. అరటి, బొప్పాయి, మొక్క జొన్న, పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. యల్లనూరు మండలం నీర్జంపల్లి, తిమ్మంపల్లి, కూచువారిపల్లి పుట్లూరు మండలం మడ్డిపల్లి, కుమ్మనమల, మడుగుపల్లి, ఎల్లుట్ల, చెర్లోపల్లి, శింగనమల మండలం నిదనవాడ, పెద్దవడుగూరు, యాడికి మండలాల్లో పెద్ద ఎత్తున అరటి పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంట కోతకు వచ్చే సమయంలో ఈదురుగాలు వర్షాలతో లక్షలాది రూపాయలను రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే నీర్జంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు ఆత్మహత్యకు యత్నించడం అత్యంత విచారఘటన అన్నారు. పంటనష్టంపై సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి ఉంటే రైతులు ఆత్మహత్యాయత్నం యత్నించి ఉండేవారు కాదన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి సకాలంలో పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యుడు వి.రామిరెడ్డి, రైతుసంఘం నాయకుడు బిహెచ్.రాయుడు పాల్గొన్నారు.

అరుగాలం శ్రమించి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షానికి నేలకూలింది. ఎన్నో ఆశలతో కష్టాలు తీరుతాయని పంటపై గంపెడాశపెట్టుకున్న రైతులకు అకాల వర్షం కోలుకోలేని దెబ్బతీసింది. రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి ఉమ్మడి జిల్లాలో వందలాది ఎకరాల్లో ఉద్యానవన పంటలు నేలకూలాయి. చేతికొచ్చిన పంట నోటికందే సమయంలో నేలకూలడంతో అన్నదాత గుండె కన్నీటి సంద్రం అయ్యింది. ఏదోఒకరూపంలో ప్రతి ఏడాదీ పంటలను కోల్పోతున్న తమను ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యేలే శరణ్యం అంటూ అన్నదాతలు అధికారులు, ప్రజాప్రతినిధుల ఎదుట కన్నీటి పర్యవంతం అవుతున్నారు.



ఈదురుగాలులతో నేలకొరిగిన అరటిపంట

రైతుకు అకాల నష్టం..!

- చేతికొచ్చిన పంట నోటికందకుండా నాశనం
- గాలులు, వర్షంతో నేల రాలిన ఉద్యానవన పంటలు
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రి సవిత
- రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం : వైసిపి
- ఆదుకోవాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శికి సిపిఎం వినతి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి బలమైన గాలులు వీచాయి. దీంతో శింగనమల, తాడిపత్రి, ధర్మవరం తదితర నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో అరటి, బొప్పాయి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. అరటిపంట కోత దశలో ఉన్న సమయంలో ఈ విపత్తు రావడం రైతులకు పెను కష్టాన్ని తెచ్చిపెట్టింది. వారం, పది రోజుల్లో కోతలు కోయాల్సిన సమయంలో పంట మొత్తం నేలకొరిగిపోవడంతో అపారమైన నష్టం సంభవించింది. ఈ నష్టం చూసి అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నీర్జాంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు అరటి రైతులు ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డారు. శింగనమల, యల్లనూరు, పుట్లూరు, పెద్దపప్పూరుతోపాటు, సత్యసాయి జిల్లాలో తాడిమర్రి ప్రాంతాల్లో పంటనష్టం తీవ్రంగా ఉంది. అధికారులు ఇంకా నష్టం అంచనాలు వేసే పనిలో ఉన్నారు. మంగళవారం నాటికి పూర్తి స్థాయి నష్టం అంచనా వచ్చే అవకాశముందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

కదిలిన అధికార యంత్రాంగం

అపారమైన పంటనష్టం సంభవించడంతోపాటు ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నంకు పాల్పడడంతో ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించింది. సోమవారం నాడు బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మలు అధికారులతో కలిసి యల్లనూరు, పుట్లూరు మండలాల్లో పర్యటించారు. కూలిపోయిన అరటితోటలకు స్వయంగా వెళ్లి పంటనష్టాన్ని పరిశీలించారు. ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని రైతులకు భరోసానిచ్చారు. అనంతరం ఆత్మహత్యాయత్నంకు పాల్పడి అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. పంట నష్టపోయిన రైతులు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం బాధిత రైతులందరినీ ఆదుకుంటుందని మంత్రి తెలియజేశారు.

భరోసా ఇవ్వని ప్రభుత్వం

వైసిపి నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి

'ప్రకృతి వైపరిత్యాలు ఎప్పుడూ సంభవిస్తూనే ఉంటాయి. ఇటువంటి సమయంలో ప్రభుత్వం రైతులకు భరోసా కల్పించేలా ధైర్యం ఇవ్వాలి. గడిచిన తొమ్మిది నెలల కాలంలో అటువంటి భరోసాను కూటమి ప్రభుత్వం రైతులకు ఇవ్వలేదు. గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో నష్టం సంభవిస్తే ప్రభుత్వం ఆదుకుంటుందన్న భరోసా రైతులకు ఉండేది. అది ఇప్పుడు లేకపోవడం వల్లనే ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నించారు. ఇప్పుడైనా కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలి' అని వైసిపి నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు.

రైతులను ఆదుకోండి

వి.రాంభూపాల్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు.

పంటనష్టపోయిన రైతులను తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డిని విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న అరటి, దానిమ్మ పంటకు ఎకరానికి లక్ష రూపాయలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొప్పాయి ఇతర ఉద్యానవన పంటలకు ఎకరానికి రూ.50 వేలు పరిహారమివ్వాలన్నారు. ఆత్మహత్యాయత్నంకు యత్నించిన రైతులకు మెరుగైన చికిత్స అందివ్వాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా నష్టపోయిన ప్రతీ రైతుకూ పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

6 నుంచి సమ్మెలోకి వెళ్తాం

తాగునీటి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర నాయకుడు జి.ఓబులు



జాయింట్ కలెక్టర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులకు పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించకుంటే ఏప్రిల్ 6వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో కార్మికులతో కలిసి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి విభాగంలో పని చేస్తున్న కార్మికులకు 6 నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వేతనాలు అందక కుటుంబ పోషణకు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 2024 సమ్మె హామీలు అమలు చేయాలన్నారు. లేని పక్షంలో కార్మికులు సమ్మెలోకి వెళ్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి జి.రాము, కోశాధికారి వన్నూర్‌స్వామి పాల్గొన్నారు.

అవిశ్వాస లేఖాస్త్రం.. అసమ్మతికి ఆజ్యం..!

- మేయర్ మార్పు వ్యవహారంపై అధిష్టానం సీరియస్
- ముగ్గురు నేతలపై సస్పెన్షన్ వేటు.?
- అచితూచి అడుగులేస్తున్న వైసిపి అధిష్టానం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్‌పై అవిశ్వాస లేఖాస్త్రం అంశం ఆ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇందుకు ప్రయత్నించిన వారిపై సస్పెన్షన్ వేటు వేసేందుకు రంగం సిద్ధమవగా ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో దానిని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆ పార్టీలో చర్చసాగుతోంది. అసమ్మతి కార్పొరేటర్ల లేఖాస్త్రం బెడిసి కొట్టడంతో వారు అధిష్టానం వద్దకు రెండు రోజుల క్రితం వెళ్లారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నందున మేయర్‌ను మార్చే ఎలాంటి పనులూ చేయొద్దంటూ అధిష్టానం గట్టిగానే వారికి చెప్పింది. అదే సమయంలో అసమ్మతి కార్పొరేటర్లు అధికార టిడిపి ముఖ్యనేత అనుచరుడితో నగరంలోని ఒక ముఖ్య వైసీపీ నేత ఇంట్లో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని వైసిపి ముఖ్యనేత అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరు అసమ్మతి కార్పొరేటర్లు టిడిపి నేతతో చర్చలు జరపటానికి సహకరించిన వైసిపి నేతపై సస్పెన్షన్ వేటు వేసేలా అధిష్టానాన్ని ఆయన కోరారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వైసిపి ఈ నిర్ణయాన్ని వెలువరించేందుకు అచితూచీ అడుగులు వేస్తోంది. అసమ్మతి కార్పొరేటర్లను వైసిపి జిల్లా ఇన్‌ఛార్జి సతీష్ రెడ్డితో సంప్రదించాలని సూచించిన అధిష్టానం సస్పెన్షన్ వేటును తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో అవిశ్వాస లేఖాస్త్రంపై సంతకాలు చేసిన వారిని దారిలో తెచ్చుకోవటానికి స్థాయిని బట్టి రూ.లక్ష నుంచి మూడు లక్షల రూపాయల వరకు డబ్బులు ఇచ్చే ప్రయత్నాలు కూడా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ డబ్బుల వ్యవహారం కాస్తా బయటకు రావడంతో ఆ పార్టీలోని మిగితా కార్పొరేటర్లు కూడా తమకూ డబ్బులు ఇవ్వాలనే డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నట్లు గుసగుసలు విన్పిస్తున్నాయి. ఈ పరిణామం వైసిపికి కొత్త తలనొప్పులను తెస్తోంది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ పీఠాన్ని ఆసరాగా చేసుకుని పావులు కదుపుతున్న ముఖ్య నేత ఆటు అసమ్మతి కార్పొరేటర్లతో పాటు మరో వైసీపీ నేతపై సస్పెన్షన్ వేటు వేయించి తన పట్టును నిలుపుకునే ప్రయత్నం కూడా చేస్తున్నారు. మేయర్‌పై అవిశ్వాస లేఖాస్త్రంతో మొదలైన ఈ వ్యవహారాన్ని రచ్చ కానీయకుండా ఎలా సద్దుమణిగించాలన్న దానిపై వైసిపి దృష్టి సారించింది.

హంద్రీనీవా కాలువ వెడల్పుతోనే ప్రయోజనం

- లైనింగ్ పనులు చేపడితే పగలగొడతాం
- ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాయలసీమ రైతులకు జీవనాడిగా ఉన్న హంద్రీనీవా కాలువను వెడల్పు చేయకుండా, లైనింగ్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం రైతులకు నష్టం చేకూర్చడమే అవుతుందని ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను వెంటనే ఆపి, వెడల్పు పనులను చేపట్టాలని కోరుతూ ఏపీ రైతుసంఘం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు ఎ.హరి అధ్యక్షతన సోమవారం నాడు పుట్టపర్తి కర్షక భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు తక్షణమే ప్రారంభించాలన్నారు. హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80వేలు, అనంతపురం జిల్లాలో రెండు దశల కింద 3,45,000, కడప జిల్లాలో 37,500, చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రస్తుత కాలువ సామర్థ్యం అందుకు అనుగుణంగా లేదన్నారు. వరద కాలంలో ఎక్కువ నీటిని తీసుకోవడానికి వీలుగా పదివేల క్యూసెక్కుల సామర్థ్యానికి కాలువ వెడుల్పు చేయాల్సి ఉందన్నారు. ఇదే విషయాన్ని 2019లో అనంతపురం జిల్లా పామిడి బహిరంగసభలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు ప్రకటించారన్నారు. ఇప్పటికీ ఆ హామీ నెరవేరలేదన్నారు. రానున్న బడ్జెట్‌లో హంద్రీనీవా కాలువ వెడల్పు, పదివేల క్యూసెక్కులకు పెంచేందుకు, ఆయకట్టు భూములకు సాగునీరు ఇచ్చేలా అవసరమైన పంటకాల్వల నిర్మాణానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించాలని కోరారు. రైతులకు లైనింగ్ వల్ల తీవ్ర నష్టం జరుగుతున్న నేపథ్యంలో దానిని ఆపాలన్నారు. ప్రభుత్వం మొండిగా వెళ్తే లైనింగ్ పనులు చేసే యంత్రాలను పగులగొడతామని హెచ్చరించారు. అనంతపురం రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, సిపిఐ రైతు సంఘం జిల్లా నాయకులు మహదేవ, కాటమయ్య, రైతు కూలి సంఘం రాష్ట్ర నాయకులు గిరీష్, ఎపి రైతు సంఘం నాయకులు సోమశేఖర్, రమణ, లక్ష్మి నారాయణ, రాజారామిరెడ్డి, సిద్దారెడ్డి, కదిరిప్ప, మారుతీ, శ్రీరాములు, నాగిరెడ్డి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

పోలీస్ స్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి

ప్రజాశక్తి-యల్లనూరు

విచారణ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు పిలవడాన్ని తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన ఘటన యల్లనూరు పోలీసు స్టేషన్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మండల పరిధిలోని బుక్కపురం మలుపు వద్ద ఆదివారం రాత్రి తిమ్మంపల్లి గ్రామానికి చెందిన రవి మిత్రులతో కలిసి కారులో మద్యం సేవిస్తున్నారు. ఇదే సమయంలో ధర్మవరం నుంచి తమ్మంపల్లి వైపు వెళున్న కార్తీక్‌రెడ్డి ద్విచక్రవాహనంలో వచ్చాడు. ద్విచక్రవాహనం కారుకు తగిలిందన్న కారణంతో రవి, కార్తీక్‌రెడ్డి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో కార్తీక్‌రెడ్డి వందకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం పోలీసులు విచారణకు పోలీసు స్టేషన్‌కు రావాలంటూ రవికి ఫోన్ చేశారు. రవి పోలీసు స్టేషన్‌కు రావడంతో రాత్రి జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. విచారణ జరుతుండగా అప్పటికే తనతో పాటు తెచ్చుకున్న వాస్మోయిల్ తాగాడు. వెంటనే బాటిల్‌ను లాగి పక్కకు పడేశారు. అనంతరం అతన్ని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఫిర్యాదు మేరకే తాము రవిని పోలీసు స్టేషన్‌కు పలిపించామని ఎస్ఐ రామాంజినేయ రెడ్డి తెలిపారు. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతుందని ఆయన తెలియజేశారు.

విమానాశ్రయం ఏర్పాటు చేయొద్దు

కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వంశ పారంపర్యంగా వస్తున్న భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ భూముల్లో విమానాశ్రయం చేయొద్దంటూ ఆత్మకూరు, కూడేరు, అనంతపురం రూరల్ మండలాల్లోన్ని గ్రామాల రైతులు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు రమేష్‌రెడ్డి, శివారెడ్డి, ద్వారకానాథ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు పలు ప్రాంతాల్లో భూముల సర్వే చేస్తున్నట్లు పత్రికల్లో వస్తున్నాయని తెలిపారు. సర్వే ప్రకారం ఆత్మకూరు మండలం, తలుపూరు గ్రామం, కూడేరు మండలం, బ్రాహ్మణపల్లి, అనంతపురం రూరల్ మండలం, సజ్జల కాలువ గ్రామాల పరిధిలో విమానాశ్రయం ఏర్పాటుకు భూములు సేకరిస్తున్నట్లు కథనాలు వస్తున్నాయని తెలిపారు. తమ భూములు విమానాశ్రయానికి ఇవ్వలేమని ప్రభుత్వం పరిశీలించి ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యాన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

ఈదురుగాలులతో జిల్లాలో పంటలు నష్టపోయిన ఉద్యాన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో అరటి, మొక్కజొన్న, దానిమ్మ, బొప్పాయి తదితర ఉద్యాన పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అధికారిక సమాచారం మేరకే సుమారు రూ.35 కోట్లకుపైగా పంట నష్టం జరిగిందన్నారు. యల్లనూరు, పుట్లూరు, పెద్దవడుగూరు, యాడికి, శింగనమల మండలాల పరిధిలో అరటి తోటలు దెబ్బతిన్నాయని తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో నేలకొరగడం బాధాకరమన్నారు. ప్రాథమిక అంచనా మేరకే శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో సుమారు 1400 ఎకరాల్లో అరటి, బొప్పాయి, మామిడి పంట నష్టం జరిగిందన్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే చేతికందాల్సిన పంట నేలనంటడంతో అన్నదాతల ఆవేదన అంతా ఇంతా కాదన్నారు. ఫిబ్రవరిలో అరటి టన్ను రూ.25వేల వరకు ఉంటే ప్రస్తుతం పూర్తిగా ధరలు పడిపోయాయని తెలిపారు. ఇలాంటి తరుణంలో పెట్టుబడులు కూడా దక్కే సూచనలు కనిపించడం లేదన్నారు. అధికార యంత్రాంగం అన్ని పంటలకు సంబంధించి సమగ్రంగా నష్టం అంచనా వేసి రైతులను ఆదుకునే దిశగా ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. అదేవిధంగా అకాల వర్షాలు, వడగళ్ల వానతో పంట నష్టపోయి యల్లనూరు మండలం నీర్జంపల్లికి చెందిన అరటి రైతులు లక్ష్మినారాయణ, వెంగప్ప ఆత్మహత్యకు యత్నించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం రైతులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతుల పట్ల ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించాలని కోరారు.

రాయదుర్గం సమగ్రాభివృద్ధికి కృషి : విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం


రాయదుర్గం పట్టణ పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. పురపాలక సంఘం సాధారణ నిధులు రూ.12లక్షలతో రూపొందించిన 40 చెత్త కుండీలు, 40 తోపుడుబండ్లను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఎక్కువ మెజారిటీతో గెలుపు అందజేసిన ప్రజల రుణం తీర్చుకునేందుకు పట్టణాన్ని సుందరంగా రూపొందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఇటీవల సిఎం చంద్రబాబు ఉంతకల్లు పర్యటన సందర్భంగా పట్టణం అభివృద్ధికి రూ.50 కోట్ల రూపాయలు నిధులు ఇవ్వాలని కోరగా విడుదల చేసినట్లు తెలిపారు. అనంతరం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రీసోర్స్‌పర్సన్ల కోసం రూపొందించిన 'ఆర్థిక, సామాజిక భద్రతకు సోపానం' కరదీపికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌లు శ్రీనివాస్ యాదవ్, వలిబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవిప్రకాష్‌నాయుడు, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి, వార్డు సభ్యులు గోవిందరాజులు, జ్యోతి, ప్రశాంతి, పద్మజ, లావణ్య, షబ్బీర్, శారద, శ్రీనివాసరెడ్డి, గోవిందా, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మిల్లెట్ మేళా

ప్రజాశక్తి-అనంతపురం

అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో మూడు రోజులపాటు అనంతపురంలో జరిగిన మిల్లెట్ మేళా సోమవారం ముగిసింది. ఆఖరి రోజు జరిగిన మేళాలో విశ్రాంత వైస్ ఛాన్సలర్ బండి వెంకటేశ్వర్లు అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వాతావరణ పరిస్థితులతోపాటు, ప్రస్తుత ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు చేయాల్సి ఉందని సూచించారు. ఒక్కసారి పంటల సాగు విధానంలో మార్పులు తీసుకొచ్చినా ఇబ్బందులు తప్పవని చెప్పారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలకు దీర్ఘకాలిక దృష్టి వ్యవసాయంపై లేదని చెప్పారు. అప్పటి అవసరాలకు అనుగుణంగా వ్యవసాయాన్ని చూస్తోందని చెప్పారు. అలా కాకుండా దీర్ఘ కాలిక లక్ష్యాలను నిర్ధేశించుకుని అందుకు అనుగుణంగా వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పరచాల్సి ఉందన్నారు. ప్రకృతి వైపరిత్యాల వల్ల నష్టపోతే రైతును ఆదుకునే బీమా విధానాన్ని మరింత పటిష్ట పరచాల్సి ఉందన్నారు. వనం ప్రసాద్ చిరుధాన్యాల వాడకం ఆవశ్యతకను తెలియజేశారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యపరంగా చేకూరే ప్రయోజనాలను వివరించారు. అనంతరం మూడు రోజుల మిల్లెట్ మేళాను విజయవంతం చేయడంలో కృషి చేసిన వారందరికీ ప్రశంసాపత్రాలు, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి, రెడ్స్ సంస్థ ప్రతినిధి భానుజ వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి పంటలను కాపాడాలి : సిపిఎం


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండల పరిధిలో ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు, కంకర క్రషర్ల నుంచి వెలువడుతున్న కాలుష్యం నుంచి పంటలను కాపాడాలని సిపిఎం మండల కార్యదర్శి లోకేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ బసవకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు, కంకర క్రషర్ల నుంచి వెలువడే కాలుష్యం వల్ల చుట్టుపక్కల పొలాల్లో సాగు చేసిన పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కావున కాలుష్యం బారిన పడి నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.మల్లికార్జున, ప్రవీణ్, అంజి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

వైసిపి నియోజకవర్గ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి


రైతును పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-పుట్లూరు

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసిపి నియోజకవర్గ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి విమర్శించారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోవడంతో మనస్థాపం చెంది ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యల్లనూరు మండలం నీర్జాంపల్లి గ్రామానికి చెందిన వెంగప్ప, లక్ష్మీనారాయణను అనంతపురంలోని ఆసుపత్రిలో సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతులు లక్షలు పెట్టుబడి పెట్టి 20 ఎకరాల్లో పంట వేస్తే అకాల వర్షాలకు చేతికి వచ్చిన పంట నేలమట్టం కావడంతో ఆవేదనతో ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. అలాంటి రైతులను ప్రభుత్వం కనీసం పట్టించుకున్న పాపానపోలేదన్నారు. అదే వైసిపి హయాంలో ఆర్‌బికెలు ఏర్పాటు చేసి రైతులకు కష్టం రాకుండా చూశామన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.


నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వినతి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దపప్పూరు : ఇటీవల వీచిన ఈదురు గాలులకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో రైతులు సాగు చేసిన అరటి, బొప్పాయి, మొక్కజొన్న తదితర పంటలు నష్టపోయాయన్నారు. వెంటనే సంబంధించిన అధికారులు పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసేందుకు గ్రామాల్లో పర్యటించాలన్నారు. కావున నష్టపోయిన మొక్కజొన్న రైతులకు ఎకరాకు రూ.50వేలు, అరటి, బొప్పాయి రైతులకు ఎకరాకు రూ.లక్ష చొప్పున చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎపి రైతుసంఘం అధ్యక్షులు నాగేంద్రయాదవ్, కార్యదర్శి పి.దేవేందర్‌రెడ్డి, కమిటీ సభ్యుడు కె.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఖాదర్‌వలి


సమావేశంలో మాట్లాడుతున్న మిల్లెట్ మాన్ ఆఫ్ ఇండియా ఖాదర్‌వలి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే చిరుధాన్యాల ఆహారం చాలా ముఖ్యమని మిల్లెట్ మాన్ ఆఫ్ ఇండియా గా పిలవబడే వ్యక్తి ఖాదర్‌వలి అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాలలో ఆహార శాస్త్రం, జీవ సాంకేతిక శాస్త్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు ప్రాచీనకాలం నుంచి మానవ పరిణామ క్రమంలో ప్రముఖ పాత్ర పోషించాయన్నారు. వర్షాభావ, ఎడారి ప్రాంతంలో ఈ ధాన్యాలు మానవులు, పశువులకు ముఖ్య ఆహారం అన్నారు. దేశంలో జొన్నలు, సజ్జలు, రాగులు, వరిగెలు ఈనాటికీ వాడుకలో ఉన్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఎన్‌ఐఆర్‌డిపిఆర్ విశ్రాంతి ఆచార్యులు వై.గంగిరెడ్డి, విశ్రాంత ఆచార్యులు ఆర్.నరసింహారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌ఎవి ప్రసాద్, ఆహార శాస్త్రం, జీవ సాంకేతిక శాస్త్రం అధ్యాపకులు ఎస్.రిజ్వానాబేగం, టి.సుదర్శన్‌రెడ్డి, జి.సాయిప్రీతి, బి.నాగ ప్రతిమ, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సేవలు ప్రశంసనీయం : సిఐ


చలివేంద్రంలో మజ్జిగ పోస్తున్న సిఐ మస్తాన్

గుంతకల్లు : వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు సిఐటియు అనుబంధ మహబూబ్ సుభానీ ఆటో యూనియన్ డ్రైవర్లు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని 2వ పట్టణ సీఐ మస్తాన్ ప్రశంసించారు. సోమవారం స్థానిక రాయల్ సర్కిల్ వద్ద అయ్యప్ప మినరల్ వాటర్ ప్రొప్రైటర్ శ్రీనాథ్ సహకారంతో మహబూబ్ సుబహాని ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు సేవా దృక్పథంతో రాయల్ సర్కిల్లో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, ఆటో యూనియన్ నాయకులు బాబురావు, జాకీర్, సాదిక్, వినీత్, సునీల్, మధు, సుంకన్న, ధనుంజయ, ఐద్వా నాయకురాలు రంగమ్మ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రమేష్, డివైఎఫ్‌ఐ నాయకులు కసాపురం రమేష్, సురేంద్ర బాబు, చంద్ర, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఎస్‌కెయులో ప్రాంగణ నియామకాలు

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శ్రీచైతన్య పాఠశాలల ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఇందులో 123 విద్యార్థులు హాజరవగా 56 ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి ఎస్‌కెయు విసి బి.అనిత నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఇ.రమేష్‌బాబు, రెక్టార్ వెంకట నాయుడు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.అనిత, శ్రీ చైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

26న ప్రజావేదిక

పెద్దవడుగూరు : మండలంలో 25 పంచాయతీల్లో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల అవకతవకలపై చేపట్టిన సామాజిక తనిఖీ ఈనెల 26న ప్రజావేదిక ద్వారా వెల్లడించనున్నట్లు ఎంపిడిఒ బారెన్‌సాహెబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా డ్వామా, విజిలెన్స్, ఆడిట్, ఉపాధి అధికారులు హాజరుకానున్నారని తెలిపారు.

అక్కమ్మ జాతరకు విరాళం

కళ్యాణదుర్గం రూరల్ : ఉగాది పర్వదినం రోజు నిర్వహించనున్న అక్కమ్మ జాతరకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సోమవారం రూ.2 లక్షల విరాళం అందజేశారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాతర విషయమై ఆలయ కమిటీ ఛైర్మన్ పద్మావతి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన రూ.2లక్షలను విరాళంగా అందజేశారు.


విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

'ఉపాధి' కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు


శింగనమలలో అధికారులతో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎపి వ్యకాసం ఆధ్వర్యంలో తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వలసలను నివారించేందుకు విరివిగా ఉపాధి పనులు కల్పించాలన్నారు. అంతేగాకుండా పని చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా గత రెండు నెలల నుంచి చేసిన పనులకు కూలి డబ్బులు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. కనీసం పండుగకు అయినా కూలి బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, సుంకన్న, రామాంజనేయులు, జయరాముడు, లక్ష్మీనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, కుళ్లాయిస్వామి, నాగరాజు, సావిత్రి, ఆదినారాయణ, సూర్యనారాయణ, రామాంజి, సంధ్యారాణి, సుబ్బమ్మ, నిర్మల, సుధారాణి, కిష్టన్న, ధనలక్ష్మి, వీరాంజి, నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలంలోని అమ్మలదిన్నె గ్రామంలో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలకు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యకాసం మండల కార్యదర్శి అమ్మలదిన్నె కుళ్లాయప్ప ఉపాధి కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్, ఓబులేసు, చలపతి, వైద్య ఆరోగ్య శాఖ నుంచి కళావతి, ఎఎన్‌ఎం స్వర్ణ, ఆశా కార్యకర్తలు సుజాత, ఆశా కార్యకర్తలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గాంధీ హరిజన హాస్టల్ స్థలాన్ని పరిరక్షించాలి

హాస్టల్ కమిటీ ఆధ్వర్యంలో వంటావార్పుతో నిరసన


నిరసన తెలుపుతున్న గాంధీ హాస్టల్ కమిటీ సభ్యులు, నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని శ్రీ గాంధీ హరిజన హాస్టల్ స్థలాన్ని పరిరక్షించాలని హాస్టల్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హాస్టల్ కమిటీ అధ్యక్షులు గుండ్రాయప్ప ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు వంటావార్పు చేసిన నిరసన తెలిపారు. ముందుగా హాస్టల్ వద్ద గట్టు వెంకటరమణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధాన రహదారి గుండా అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకుని విగ్రహానికి పూలమాల వేశారు. తర్వాత ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ హరిజన హాస్టల్ స్థలాన్ని సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తర్వాత తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళనకు నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జునగౌడ్, సుల్తాన్, ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు మధు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరమెట్ల యల్లన్న, కౌకుంట్ల రవి, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే.హరి, ఎస్సీ,ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి మధుప్రసాద్, జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ హరిజన కమిటీ సభ్యులు తిప్పయ్య, సర్పంచు జగదీష్, ఆనంద్‌రాజు, గోపాల్, చంద్రశేఖర్, గోవిందప్ప, భీమప్ప, బెంజిమెన్, రామాంజనేయులు, ఎర్రిస్వామి, ఆంజినేయులు, యల్లన్న, కేంగూరి ఎర్రిస్వామి, వీరప్ప, నారాయణస్వామి, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని రద్దు చేయొద్దు

ఎపి బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ నాయకులు


ఎంఇఒకు వినతిపత్రం అందజేస్తున్న బీడీ కార్మికులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పేదల, కార్మికుల పిల్లలకు ప్రయివేటు పాఠశాలల్లో అందించే ఉచిత విద్యా హక్కు చట్టాన్ని రద్దు చేయొద్దని ఎపి బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ ఉమాగౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు బీడీ కార్మికులతో కలిసి సోమవారం స్థానిక కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి రామగోవిందరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్బంధ విద్యా హక్కు చట్టం ఆర్‌టిఇ 2009 (రైట్ టు ఎడ్యుకేషన్) ప్రకారం 2009 ఆగస్టున అమలులోకి వచ్చిందన్నారు. ఈ చట్టం అమలులోకి వచ్చినప్పుడు కార్మికులు పేదలు తమ పిల్లలను ప్రయివేటు పాఠశాలల్లో చేర్పించారన్నారు. కానీ ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ రైట్ టు ఎడ్యుకేషన్ 2009 చట్టాన్ని రద్దు చేసిందన్నారు. దీంతో ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న కార్మికులు పేదల పిల్లలను ప్రయివేట్ స్కూలు యాజమాన్యం ఆయా స్కూల్ లలో ఫీజులు చెల్లించాలని, లేకపోతే స్కూల్ నుంచి పంపి టీసీ ఇవ్వమని రకరకాల కారణాలతో వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో కార్మికులు ఎన్నో రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కావున ప్రభుత్వం ఈ చట్టాన్ని తిరిగి అమలులోకి తేవాలన్నారు. లేనిపక్షంలో బీడీ, వర్కర్స్‌ను కలుపుకుని కార్మికుల విద్యా హక్కు చట్టం కోసం పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మికులు నూర్జాహాన్, సైమూన్, లక్ష్మీకాంతమ్మ, ఇమ్రాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకోర్టులో నిలబెడతాం

మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

నియోజకవర్గంలో ఎవరు కబ్జాదారులో, దోపిడీదారులో ప్రజకోర్టులో నిలబెడతామని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలం పాపంపేట 106-1 సర్వే నంబరులోని 67సెంట్ల భూమిని కబ్జా చేయాలని చూసిన వారికి న్యాయదేవత చెంపదెబ్బ కొట్టిందన్నారు. ఆ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని, ఎలాంటి లావాదేవీలు జరగకూడదని, రిజిస్ట్రేషన్లు చేయకూడదని, ఆన్‌లైన్ రికార్డుల్లో ఎలాంటి మార్పులు జరగకూడదని స్టే ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీతకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆ ప్రాంతానికి వెళ్లి బాధితులను పరామర్శించాలి కదా.. అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో జరుగుతున్న దోపిడీ విధానం, ఆక్రమణల విధానం జిల్లా ప్రజలందరికీ అర్థమవుతోందన్నారు. పరిటాల సునీత ప్రజలతో నాకేం పని.. ప్రజల ఇళ్లను పేకమేడలా కూల్చినా నష్టం లేదు.. ఎందుకంటే చంద్రబాబు మళ్లీ ఇవిఎంలతో గెలిపిస్తాడని భావిస్తోందని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో న్యాయస్థానం ముందు దోషులుగా నిలబెడతామని హెచ్చరించారు.

ఉత్తమ ట్రైనర్‌గా టి.మనోప్రియ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్


సర్టిఫికెట్ అందుకుంటున్న మనోప్రియ

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో మెప్మా విభాగంలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా పని చేస్తున్న టి.మనోప్రియ ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్‌గా శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్ అందుకున్నారు. మనోప్రియ రెండు నెలలపాటు ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గంప నాగేశ్వరరావు, నేషనల్ ప్రెసిడెంట్ రామచంద్రుడు, వైస్ ప్రెసిడెంట్ మాదవి, ప్రముఖ మోటివేటర్ ఇన్ఫ్లుయెన్సర్, సినిమా యాక్టర్ ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

31లోపు ఇకెవైసి పూర్తి చేయాలి

తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య

ప్రజాశక్తి-శింగనమల

మండలవ్యాప్తంగా రేషన్ కార్డుదారులు ఈనెల 31వతేదీలోగా డీలర్ల వద్ద ఇకెవైసి చేయించుకోవాలని తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య సూచించారు. సోమవారం మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో మండల కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డులోని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు. మండలవ్యాప్తంగా 4,672 మంది ఇంకా ఇకెవైసి చేయించుకోలేదన్నారు. ఇకెవైసి చేయించుకోకపోతే వచ్చేనెలలో రేషన్ ఇవ్వరన్నారు. కావున ప్రతి ఒక్కరూ సంబంధిత చౌకధాన్య డీలర్ వద్ద ఈపాస్ యంత్రంలో వేలిముద్ర లేదా, గ్రాయ సచివాలయ మొబైల్ యాప్‌లోగా ఇకెవైసి చేయించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి చంద్రకళ, డీలర్లు దేగల శ్రీనివాసులు, రంగారెడ్డి, వెంకటనారాయణ, మసూద్‌వలి, కాయగూరల సత్తి, శివ, రమేష్, సుదర్శన్‌నాయక్, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు .

పక్కా గృహాలు నిర్మించాలని వినతి


తహశీల్దార్ కార్యాలయానికి తరలివచ్చిన మహిళలు

ప్రజాశక్తి-గుత్తి

నిరుపేదలైన తమకు నివేశన స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని మండలంలోని పెదొడ్డి గ్రామానికి చెందిన మహిళలు విన్నవించారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయానికి సుమారు 45 మంది మహిళలు తరలివచ్చి తహశీల్దార్ ఓబిలేసును చుట్టుముట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ పెద్దొడి గ్రామానికి చెందిన తమకు సొంత స్థలం లేదని ఇళ్లు లేక అద్దె నివాసాల్లో ఉంటూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు గురవుతున్నామని వాపోయారు. గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తమకు ఇంటి స్థలాలు కేటాయించి గహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

శ్రీనివాసరెడ్డికి డాక్టరేట్


పిహెచ్‌డి పట్టా అందుకుంటున్న శ్రీనివాసరెడ్డి

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వాణిజ్య శాఖ విభాగంలో డి.ఆంజనేయులు పర్యవేక్షణలో 'స్వయం సహాయక బృందాలు, వాటి పనితీరు పై విశ్లేషణాత్మక అధ్యయనం' అనే అంశంపైన పరిశోధన చేసినందుకు దుబ్బ శ్రీనివాసరెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈయన పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పలు పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ పొందినందుకు పలువులు ఆచార్యులు, నాన్ టీచింగు ఉద్యోగులు, స్నేహితులు అభినందించారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

ఉరవకొండ : భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి శుభకర్ సూచించారు. సోమవారం ఉరవకొండ రైతు సేవాకేంద్రంలో పంట సాగుపై రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అవసరానికి మించిఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గిపోతోందన్నారు. కావున భూసార పరీక్షలు చేసుకుని అందుకు అనుగుణంగా ఎరువులు వాడాలన్నారు. ఇకపోతే రైతులు విశిష్ట గుర్తింపు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు శనగ పంటను విక్రయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ భరత్, సిరికల్చర్ అసిస్టెంట్ లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

యల్లనూరు ఎపిఒగా రవి



యల్లనూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నూతన ఎపిఒగా రవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. చక్రాయపేట ఎపిఒగా విధులు నిర్వహిస్తూ యల్లనూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న షబ్బీర్ చక్రాయపేటకు బదిలీ అయ్యారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పుట్లూరు : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం మండలంలో పర్యటించి అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటను పరిశీలించనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ బాలరంగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎల్లుట్ల, మడ్డిపల్లి, రంగరాజుకుంట, రంగినేపల్లి, కొండుగారికుంట గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకోనున్నట్లు తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


అరటి తోటను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కేశవనాయుడు

పుట్లూరు : మండలంలో శనివారం రాత్రి వీచిన గాలులకు నేలకొరిగిన పంటలను ఆర్‌డిఒ కేశవనాయుడు సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా మండలంలోని కుమ్మనమల, మడ్డిపల్లి గ్రామాల్లో ఆర్‌డిఒ పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత రైతులను పరామర్శించి పంట నష్టం వివరాలపై ఆరాతీశారు. నివేదికన ప్రభుత్వానికి పంపి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ శేషారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

బస్సులు నడపాలని వినతి

బొమ్మనహాల్ : మండల కేంద్రంలోని బస్టాండ్‌కు ఆర్టీసీ, ప్రయివేటు బస్సులు వచ్చేవిధంగా చర్యలు చేపట్టాలని సిఐటియు మండల నాయకులు ఓబులేసు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ డిపోల నుంచి బొమ్మనహాల్ మీదుగా బళ్లారికి వెళ్లే ఆర్టీసీ, ప్రవేటు బస్సులు బస్టాండుకు రావడంతో లేదన్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే స్పందించి బస్సులు బస్టాండ్‌కు వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతిచెందిన సుంకన్న

ఉరవకొండ : విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో సోమవారం విషాదం నెలకొంది. తాగునీటి కొళాయికి మోటార్ వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై సుంకన్న (22) మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఉదయం కుళాయికి నీరు రావడంతో మోటార్ ఆన్ చేసి పైపు బిగుస్తున్న సమయంలో ఒక్కసారిగా షాక్ కొట్టి కుప్పకూలిపోయాడు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి ఏడాది క్రితమే వివాహం కాగా నెల క్రితం కవలలు జన్మించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఘర్షణలో భార్యాభర్తలకు గాయాలు

గుత్తి : మండలంలోని జక్కలచెరువు (ఆర్‌ఎస్) గ్రామంలో పొలంకు వెళ్లే రస్తా విషయంలో సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా మేరకు.. గ్రామానికి చెందిన రామకృష్ణకు పక్క పొలం రైతు ప్రసాద్ మధ్య కొన్ని నెలలుగా రస్తా విషయంలో గొడవలు ఉండేవి. ఈ క్రమంలో మరోమారు గ్రామ శివారులో ఉన్న పొలం వద్ద ఘర్షణ జరిగి తీవ్రస్థాయిలో వాగ్వాదం చేసుకున్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటా మాటా పెరిగి ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడిలో రామకృష్ణ, లక్ష్మీదేవి దంపతులకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుమారు పదిమంది తమపై దాడి చేసి గాయపరిచారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు..

మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ జాతీయ రహదారిపై సోమవారం ద్విచక్రవాహనంలో నుంచి జారిపడి శేషమ్మ తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తొండపాడు గ్రామానికి చెందిన రాఘవేంద్రగౌడ్ తన భార్య శేషమ్మ అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో ఆమెకు చికిత్స చేయించేందుకు గుత్తికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. అయితే కొత్తపేట గ్రామ శివారులో బైక్ లో వెనుక వైపు కూర్చున్న శేషమ్మ రోడ్డుపై కిందపడి పోయింది. అయితే వెనుక నుంచి ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బైక్ నుంచి పడి తీవ్రంగా గాయపడిన శేషమ్మను వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు శేషమ్మను మెరుగైన చికిత్సలకు అనంతపురానికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కత్తులతో దాడి..ముగ్గురికి..

పట్టణంలో ఇరువర్గాలు ఘర్షణ పడి కత్తితో పొడుచుకోవడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి గుత్తిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన యోగి, మనోజ్, ఆంజనేయులుకు అదేకాలానికి చెందిన గణేష్‌తో గొడవలు ఉండేవి. ఈ క్రమంలో గణేష్ అన్నపూర్ణ హోటల్ సమీపంలో ఉండగా యోగి, మనోజ్, ఆంజనేయులు గొడవ దిగారు. దీంతో అక్కడే ఉన్న ఆటో డ్రైవర్ ఆంజనేయులు, రాము, టైలర్ దాదు అడ్డుకుని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉండగా వారు అక్కడికి రాగా మరోమారు గొడవ జరిగి ఆటో డ్రైవర్ ఆంజనేయులును కత్తితో పొడిచారు. రామును రాళ్లతో కొట్టి కత్తితో దాడి చేయగా చేతికి బలమైన గాయాలయ్యాయి. దాడి చేసిన అనంతరం వారు అక్కడి నుంచి పారిపోగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆంజనేయులు, రామును మెరుగైన చికిత్సలకు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేశారు. అనంతరం నిందితులు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చలివేంద్రం ప్రారంభం

శింగనమల : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపిడిఒ భాస్కర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎ డిఒ మాట్లాడుతూ మండల కేంద్రానికి వచ్చే ప్రజల సౌక ర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శి లీలారాణి, నాయీబ్రాహ్మణ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, టిడిపి సీనియర్ నాయకు డు చాకలి వెంకటేష్, డీలర్ మసూద్‌వలి, కాయగూరల సత్తి, టిడిపి కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

అనంతపురం : నగరంలోని రామ్‌నగర్‌లో కీర్తి మెడికల్ స్టోర్స్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బ్లడ్ షుగర్, బ్లడ్ ప్రెషర్, బాడీ వెయిట్, బాడీ మాస్ ఇండెక్స్, బాడీ ఫ్యాట్ కాంపోజిషన్, విసిరల్ ఫ్యాట్ కాంపోజిషన్, మెట్టబోలికి ఏజ్ బాడీ మజిల్ మాస్ పరీక్షలను ఉచితంగా చేసినట్లు బ్రాంచ మేనేజర్ మధుసూదన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ అరుణ్, గురు, సిబ్బంది రాజు, నాగరాజు, శ్రీధర్, రాణి, రాజేశ్వరి, మైలారప్ప పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు : మండల కేంద్రంలోని కస్తూరిబా గాం ధీ పాఠశాలలో 2025-26వ విద్యా సంవత్సరంలో ప్రవేశా నికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఒ మాధవి సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాప్ అవుట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బిపి ఎల్ బాలికలు మాత్రమే అర్హులు అన్నారు. ఆయా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్ల మరమ్మతులకు తనిఖీలు

రాప్తాడు : మండల కేంద్రంలోని కోటవీధి కాలనీలో డ్రెయినేజీలు, దెబ్బతిన్న సీసీ రోడ్లకు మరమ్మతులు చేసేందుకు అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రోడ్ల మరమ్మతులపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వచ్చేనెలలో రోడ్లకు మరమ్మతులు చేయనున్నట్లు ఎంపిడిఒ బుల్లే విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కొండప్ప, సర్పంచు తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి

రాయదుర్గం : పట్టణంలోని సెయింట్ పాల్ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న ప్రధానోపాధ్యాయులు ఎస్.మురహర (62) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన గుమ్మగట్ట మండలం గొల్లపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వచ్చే జూన్‌లో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆకస్మికంగా మృతిచెందడంతో కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు. విషయం తెలుసుకున్న విప్ కాలవ శ్రీనివాసులు, వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి కిష్టప్ప తదితరులు మురహర భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బియ్యం బేడలు వేలంపాట

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి, భవాని భీమలింగేశ్వర స్వామివార్లకు భక్తులు సమర్పించిన బియ్యంబేడలకు సోమవారం వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా యాడికికి చెందిన బిఎం బలరాముడు కిలో 29 ప్రకారం 50 కిలోల బియ్యాన్ని వేలంపాట పాడి దక్కించుకున్నట్లు ఇఒ సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పండ్ల తోటల రైతులను ఆదుకోండి

అనంతపురం సిటీ : అకాల వర్షాలకు రాష్ట్రంలో దెబ్బతిన్న పండ్ల తోటల రైతులను ఆదుకోవాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు, రైతు పరిరక్షణ సమితి అధ్యక్షులు పోతుల నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఒక వైపు అకాల వర్షాలు, మరోవైపు తీవ్ర మైన ఎండలకు, మార్కెట్ లో దళారుల మోసాలు, గిట్టుబాటు ధర లేక పెట్టిన పెట్టుబడి రాక రైతు జీవనం దినదిన గండంగా మారుతూ అప్పుల పాలవుతూ చివరికి ఆత్మ హత్యలవైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ పరిస్థితి నుంచి రైతులను గట్టెంకించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుని ఆదుకోవాలన్నారు.

టిబి వ్యాధిని తరిమికొడదాం

అవగాహన ర్యాలీల్లో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరం సామాజిక బాధ్యతగా భావించి టిబి వ్యాధిని తరిమికొడదామని డిఎంహెచ్ఒ ఇబి దేవి పిలుపునిచ్చారు. ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి సప్తగిరి కూడలి వరకూ టిబిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డిఎంహెచ్ఒ ప్రారంభించారు. అనంతరం సప్తగిరి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి టిబి నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ టిబి రాకుండా ప్రజల్లో అవగాహన అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి వెళ్లి గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. ఒకవేళ టిబి నిర్ధారణ అయితే ఉచితంగా అందించే డాట్స్ చికిత్సను తీసుకోవాలన్నారు. మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి అనుపమ జేమ్స్, జిల్లా వైద్య పర్యవేక్షణ అధికారులు, ఐఎంఎ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, సభ్యులు శ్రీనాథ్, అభిషేక్‌రెడ్డి, రవి శ్రీనివాస్, ప్రయివేట్ ప్రాక్టీషనర్ డాక్టర్ సుధీంద్ర, అప్నా జిల్లా వైస్ ప్రెసిడెంట్ అంజనీకుమార్ కోడే, ఆరోగ్య బోధన అధికారులు సత్యనారాయణ, గంగాధర్, పిఎంఒ నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ వైద్య కళాశాల శ్వాస కోస వ్యాధుల విభాగం, సామాజిక వైద్యశాస్త్ర విభాగం, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శంషాద్ బేగం, డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ సరళ, రెస్పిరేటరీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ ఆర్ఎంఒ డాక్టర్ హేమలత, రెస్పిరేటరీ మెడిసిన్ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ రామస్వామి, అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీధర్, సహాయ ఆచార్యులు అశోక్‌కుమార్, సతీష్, సౌజన్య లక్ష్మి, ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ శంకర్, అనాటమీ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ ఆర్ఎంఒ హేమలత, మైక్రో బయాలజీ ఇన్‌ఛార్జి సరోజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, రెస్పిరేటరీ మెడిసిన్ జూనియర్ రెసిడెంట్లు నఫీసా, సాయితరుణ్, స్వప్న మాధురి, సునంద, రామ్సి, 2024 బ్యాచ్ మెడికోలు పాల్గొన్నారు.

స్థానిక రామచంద్ర నగర్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర చెస్ట్, అలర్జీ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీంద్ర మాట్లాడుతూ టీబీ వ్యాధి వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలతోపాటు అవగాహన అవసరం అన్నారు. ప్రస్తుతం అత్యాధునికమైన వైద్య సదుపాయాలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా వైద్య శాఖ అధికారి కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీలో ఆసుపత్రి సిబ్బంది రవి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ మెర్సీ జ్ఞానసుధ, క్షయ విభాగం వైద్యాధికారి ఎస్ రమేష్ జండా ఊపి ప్రారంభించారు. ప్రయివేటు బస్టాండ్ రాణి సత్రం వరకూ ర్యాలీ సాగింది. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యాధికారి యశ్వంత్ రాజ్, హోమియో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగజ్యోతి, నర్సింగ్ సూపరింటెండెంట్ రమణమ్మ, టిబి వ్యాధి నివారణ సిబ్బంది సురేష్‌బాబు, ఐసిటిసి కౌన్సిలర్ కృష్ణమూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ అల్తాఫ్ హుస్సేన్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు ప్రమీల, విజయలక్ష్మి,



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సుధీంద్ర



టిబి నివారణ ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ ఇబి దేవి

తులసి, బ్లడ్‌బ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్లు శ్రీనివాసులు, వరప్రసాద్, ఎక్స్‌రే టెక్నీషియన్ కిరణ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరులో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో బి.పప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కె.హజీరా, పర్యవేక్షకులు ఎం.శ్రీరాములు ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఎఎస్ఎం అంజలి, ఆశా కార్యకర్తలు కె.రామసుబ్బమ్మ, బి.మాధవి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ విభాగం, రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీ టి సర్కిల్ వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో వైద్యులు రాజేష్, చరణ్, శివ, రిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ మహేష్, ఐసిటిసి కౌన్సిలర్ ఈశ్వరయ్య, ఎన్‌జిఒ సంఘం ఉపాధ్యక్షుడు మాధవ జానీ, టిబి నివారణ సూపర్‌వైజర్ సత్యనారాయణ, సురేష్, స్టాఫ్‌నర్స్ సుగణ, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్, సిహెచ్‌సి వైద్యాధికారి రోహినాథ్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చంద్రశేఖర, టిప్పు హుస్సేన్, టిబి నివారణ సూపర్‌వైజర్ ఉమా మహేశ్వరి, పిహెచ్‌సి సూపర్‌వైజర్లు నాగమ్మ, అశ్వర్థ నారాయణ, హెచ్‌ఐవి లింక్ వర్కర్ విజయభాస్కర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : చాపకింద నీరులా వ్యాపించే క్షయవ్యాధి నిర్మూలనకు అందరం పాటుపడాలని వైద్యులు శ్రీనివాసబాబు, అమర్నాథ్ సూచించారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం పెద్దవడుగూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.

26న ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నికలు

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నికలు ఈనెల 26న ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో ఛైర్మన్ ఎస్ సిరాజుద్దీన్, సెక్రటరీ జనరల్ లింగమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారిగా మృదయ రాజు వ్యవహరిస్తారన్నారు. కావున ఎన్నికలకు ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆలయానికి విరాళం

పామిడి : మండలంలోని అనుంపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయానికి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో తోటి నిర్మాణ సంస్థల అధినేత లతో రూ.25వేలు విరాళం అందజేశారు. ఎస్‌విజిఎస్ కన్స్ట్రక్షన్ తమ్మినేని సిద్దార్థ చౌదరి రూ.10వేలు, బెల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ యజమాని రాకెట్ల రమేష్ రూ.5 వేలు, రియల్టర్ ఓబిరెడ్డి రూ.10వేలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు సుంకప్ప, మండలం ఉపాధ్యక్షులు కాయల మహేష్, మాజీ చెరువు ప్రెసిడెంట్ భాస్కర్‌యాదవ్, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు ఆవుల శివ పాల్గొన్నారు.

నేడు కంబదూరు సర్వసభ్య సమావేశం

కళ్యాణదుర్గం రూరల్ : కంబదూరు మండల పరిషత్ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ గూడెన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి ఎంపిపి లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

పెద్దపప్పూరు : ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఆదివారం ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ముందుగా శ్రీకృష్ణ ఆలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వర్గీకరణకు అనుకూలంగా ప్రభుత్వాలు స్పందించడంతో మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రంగనాయకులు, చిన్న పెద్దన్న, ఓబులేసు, గండికోట లక్ష్మీదేవి, చంద్రశేఖర, నాగలక్ష్మి, సావిత్రి, సూర్యనారాయణ, సూర్యనారాయణమ్మ, రామాంజనమ్మ, చంద్రకళ, సులోచన, పెద్దక్క, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

అనంతపురం కలెక్టరేట్ : ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశాల నగరంలోని ఈద్గాల్లో రంజాన్ ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈసందర్భంగా ఇప్పటికే మసీదులు, ఈద్గాలలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశించారు. ఇప్పుడు రంజాన్ సమీపిస్తుండటంతో ఈద్గాలలో జరుగుతున్న పనులను ఆయన ఫోన్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. నీటి వసతితో పాటు అక్కడ అంబులెన్స్ ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, టీడీపీ నాయకుడు మణికంఠ బాబు, జిల్లా మైనార్టీ నాయకుడు జేఎం బాషా, సైఫుద్దీన్, రజాక్, కలందర్ మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ తదితరులు ఈ ఏర్పాట్లను పరిశీలించారు.

ఎస్సీల్లో చేర్చేందుకు ప్రతిపాదన చేయడం హర్షణీయం

రాయదుర్గం : బేడ బుడగ జంగం సామాజిక వర్గాన్ని ఎస్సీల్లో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేయడం హర్షణీయమని బేడ బుడగ జంగం సామాజిక వర్గం ప్రతినిధులు అన్నారు. అసెంబ్లీతోపాటు కేబినెట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ అంశంలో జెసి శర్మ కమిషన్ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించడాన్ని హర్షిస్తూ బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి ప్రతినిధులు సోమవారం పట్టణంలోని కార్యాలయంలో విప్ కాలవ శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. జెసి శర్మ కమిషన్ నివేదికను ఆమోదించడంపై సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బలగల్ల జమ్మన్న, పెద్ద బాలయ్య, మారేష్, సురేష్, శంకర్, వెంకీ, రవి, చిన్న జమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.


ట్యాంకును ప్రారంభిస్తున్న దృశ్యం

తాగునీటి ట్యాంకు ఏర్పాటు

గుత్తి : చికిత్సల నిమిత్తం వచ్చిన రోగులకు వారి సహాయకుల తాగునీటి సౌకర్యార్థం గుత్తి ప్రభుత్వాసుపత్రిలో సోమవారం తాగునీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. ఆసుపత్రికి వచ్చినవారు తాగునీటి కోసం అవస్థలు పడుతుండటంతో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు చౌదరి విజయభాస్కర్ తాగునీటి ట్యాంకును విరాళంగా ఇచ్చారు. దీంతో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్ప ఆస్పత్రిలోని ఓపి యూనిట్ వద్ద ట్యాంకు ఏర్పాటుచేసి తాగునీటి సౌకర్యం కల్పించారు. ట్యాంకును విరాళంగా ఇచ్చిన దాత విజయ భాస్కర్‌ను డాక్టర్ యల్లప్ప అభినందించారు.